వెన్నెల రాత్రి

అల్లాడి రమేష్

మద్రాస్ సెంట్రల్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. మేము ప్రయాణికులను తప్పించుకొని ప్లాట్‌ఫామ్ నంబర్ ఫైవ్‌కి వెళ్ళేసరికి 'ఫ్రం మద్రాస్ టు హౌరా మెయిల్' కదలడాన్కి సిద్ధంగా వుంది. మా కంపార్ట్‌మెంట్‌లోనికి వెళ్ళి బెర్తులు చూసుకొంటుండగా కదిలింది. అప్పుడు సమయం రాత్రి పదిగంటల ఇరవయ్ ఐదు నిముషాలు. అసలు మెయిల్ బయల్దేరవలసింది, పది గంటలకే వెళ్ళిపోయుంటుందని కూడా వూహించాం. అది ట్రైనుకు స్టార్టింగ్ ప్లేస్ అయినంత మాత్రాన, అంతకు ముందే సంపాదించిన 'లేటు' అనే గొప్ప పేరు తమ మూలాన పోవడం ఇష్టముండదు కదా! దాని ప్రభావమే ఈ ఇరవయ్ ఐదు నిముషాలు లేటు. మాకు ప్రయాణప్రాప్తి. అసలు మా ప్రయాణమే సడన్‌గా ఫిక్స్ అయింది.

సాయంత్రం ఐదు గంటలకు మా డైరక్టర్ కమ్ ప్రొడ్యూసర్‌గారు, రాన్స్ ఫ్లాట్స్‌లో వున్న మా ఆఫీసుకు వచ్చి, ప్రయాణం ఈరోజే అని చెప్పారు నాతో. కొద్దిరోజులలో వెళ్ళాలని తెలుసుకొని ఇంత సడన్‌గా ఫిక్స్ అవుతుందనుకోలేదు.

మా డైరెక్టర్ గారికి జాతకాల పిచ్చి. ఎవరో చెప్పి వుంటారు. భూమి పుట్టిన ఇన్ని కోట్ల సంవత్సరాలలోనూ ఇంతమంచి రోజు మరొకటి లేదని. అలాగని పిక్చర్స్ డైరక్ట్ చేయడంలో మరొకటి, మరొకటి అనుకుంటే అది మీ పొరపాటవుతుందే తప్ప నాది కాదు. ఇప్పటివరకు తీసిన మూడు పిక్చర్స్ సూపర్ హిట్టే.

నాకు వినబడుతూనే వుంది. ఆయన మా ప్రొడక్షన్ మేనేజర్‌ని (అది మేము పెట్టిన పేరులెండి చేసేవి మాత్రం ఆఫీస్‌బోయ్, వాచ్‌మన్) పిలిచి, రాజమండ్రికి రెండు టికెట్స్ తీసుకు రమ్మని చెప్పడం. నాకు తెలుసు రిజర్వేషన్ క్లోజ్ చేసి వుంటారని అయినా మా ప్రొడక్షన్ మేనేజర్ తన ఇన్‌ఫ్లూయెన్స్ ఉపయోగించి ఎలాగైనా రెండు టికెట్స్ తీసుకురాగలడని కూడా తెలుసు. అయితే నేను వూహించింది వెంటనే జరగలేదు. నాల్గున్నర గంటలు ఆలస్యంగా జరిగింది. ఫలితం తొమ్మిదిన్నరకు టికెట్స్ వచ్చిన వెంటనే స్టేషన్‌కు బయల్దేరటం జరిగింది.

ఇంతకీ మా ప్రయాణానికి కారణం మా నెక్స్ట్ పిక్చర్‌కి లొకేషన్ సెలెక్ట్ చేయడానికి "కథానుగుణంగా మా పిక్చర్‌కి నదీ పరిసర ప్రాంతం" కావాలి.

ట్రైన్ సిటీ లిమిట్స్ దాటింది. 'గుడ్‌నైట్ అసిస్టెంట్ డైరక్టర్" అన్నారు మా డైరక్టర్ గారు. ఎక్కువ సంతోషంగా వున్నప్పుడు ఆయనకు నన్నలా పిలవడం అలవాటే — ఎందుకంటే నేను అసిస్టెంట్ డైరక్టర్‌నే కాబట్టి. నేను కూడా 'గుడ్‌నైట్' చెప్పి నిద్రకుపక్రమించాను.

భయంకరమైన రణగొణ ధ్వనులకు కనులు విప్పి చూశాను. విజయవాడ స్టేషన్‌లో ఆగివుంది మేమెక్కిన ట్రైన్. టైమ్ ఏడున్నర కావస్తూంది. అంతకు ముందే లేచినట్టున్నారు మా డైరక్టర్‌గారు నావంక చూసి చిరునవ్వు నవ్వారు. ఇద్దరం కాఫీ త్రాగి ఉదయపు పేపరు ఒకటి కొని అది ఆయన వెంట తెచ్చుకొన్న నవల నేను కళ్ళతో తినేయసాగాం. ఎంతసేపు గడిచిందో తెలియదు. ఒక్కసారిగా, గుప్పుమన్న హాహాకారాలతో మా కంపార్ట్‌మెంట్ అంతా వెలరేగింది. (వడలు, పునుగులు అమ్మే నల్గురైదుగురు కుర్రాళ్ళు మా కంపార్ట్‌మెంట్‌లోనికి జొరబడ్డారు) ట్రైన్ ఆగివుంది. ఏదో చిన్న స్టేషన్‌లా వుంది. స్టేషన్ పేరు చూశాను ఎక్కడో దూరంగా కనబడుతూంది. 'చేబ్రోలు' అని. వెంటనే ట్రైన్ బయల్దేరింది. రాజమండ్రి వెళ్ళేసరికి సమయం పదిన్నర అయింది.

వెంటనే ఆటో ఎక్కి మంచి హోటల్‌కి తీసుకుపొమ్మని చెప్పాం. ఆటో హోటల్ మేడూరి ఎంట్రెన్స్ ముందు ఆగింది. మీటర్ చార్జికన్న అదనంగా చెల్లించి డబుల్ రూమ్ తీసుకొని స్నానాదులు, బ్రేక్‌ఫాస్ట్ ముగించి లొకేషన్ డిస్కషన్ మొదలు పెట్టాము. ఆఖరుకు నేనే ఫైనలైజ్ చేశాను. ఆరోజుకి పూర్తిగా రెస్ట్ తీసుకోవడం, మర్నాడు బయల్దేరి, పోలవరం వరకు టాక్సీలో వెళ్ళి, అక్కడి నుండి గోదావరి నదిమీద లాంచిలో ప్రయాణం చేయాలని. ఎందుకంటే 'బస్‌వే' లేదు కనుక. ఆయన వెంటనే ఒప్పేసుకున్నారు. ఒప్పుకోక ఏంచేస్తారు. అంతకన్నా దారిలేదు.

మర్నాడు ప్రొద్దుట అనుకున్న ప్రకారమే హోటల్ రూమ్ ఖాళీ చేసి లగేజ్ అంతా తీసుకొని పోలవరం వరకు వెళ్ళాము. ఇక్కడనుండే ప్రారంభమైంది మా అసలు ప్రయాణం.

సరిగ్గా రెండు గంటలకు మేమెక్కిన లాంచీ పోలవరం రేవును వదలి గోదావరి ఎగువకు ప్రయాణం ప్రారంభించింది. గోదావరి నిర్మలంగా, నిశ్శబ్దంగా వుండి, సూర్యరశ్మిచేత వెండిమబ్బులా అలల రూపంలో మెరవసాగింది. గోదావరి కిరుప్రక్కలా కొద్దిదూరంలో వున్న కొండలు ఒక ఆకృతి లేనట్టు చందమామ పుస్తకంలోని రాక్షసుడి తలలా, ఆ కొండలపై వున్న ఒకటి అరా చెట్లు ఆ తలపై వున్న కొమ్ముల్లా గోచరించసాగాయి. "గోదావరి మెల్లగా నిశ్శబ్దంగా సాగిపోతుంది అనుకున్నా" కాని అక్కడే పొరబడ్డానని అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న పూడిపల్లికి గంటన్నర ప్రయాణం చేసిన తరువాత కాని తెలియలేదు. అక్కడితో ఆ లాంచి ఆగిపోతుంది. ఇంకా ముందుకు వెళ్ళాలంటే మర్నాడు వచ్చే మెయిల్ లాంచిలో వెళ్ళాలి.

'పూడిపల్లి' అనేది గోదావరి గట్టుమీద వున్న చిన్నపల్లె. ఆరోజుకు అక్కడే 'స్టే' చేయదలచి మాకారోజు ఆశ్రయమిచ్చి క్షుద్బాధ తీర్చేవారికోసం ఎంక్వయిరీ ప్రారంభించాము.

మరువాడు మెయిల్ లాంచి వచ్చే సమయానికి ముందుగానే మా సరంజామాతో రేవు వద్దకు చేరుకున్నాం. 'మెయిల్ లాంచి' రాలేదు కాని 'వాచి'లోని చిన్నముల్లు పెద్దముల్లు మాత్రం మూడు ఆరు మీదకు చేరుకున్నాయి. ఇంజన్ పాడయినందువల్ల ఇక ఆరోజుకి మెయిల్ లాంచి రాదని అప్పుడే వచ్చిన (నిన్న మేమెక్కి వచ్చిన) లాంచివాళ్ళు చెప్పారు. మా అవస్థ గమనించి వాళ్ళే అడిగారు ఎక్కడకు వెళ్ళాలని, మేము చెప్పినదంతా విని రెండువేల రూపాయాలు ఇస్తే ఆరు రోజులు అన్ని ప్రదేశాలకు తీసుకువెళ్తామని, భోజన ఏర్పాట్లు కూడా వాళ్ళే చేస్తామన్నారు. మేము ఆ కాంట్రాక్టుకు వెంటనే ఒప్పేసుకున్నాం. పైపెచ్చు లోలోన ఆనందించాం, ఆ నిర్మానుష్య ప్రాంతాల్లో ముగ్గురు లాంచీ సిబ్బంది తోడు దొరికినందుకు.

అలా ప్రయాణం ప్రారంభించి రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతంలో ఒక ప్రదేశంలో ఆగాము. దానినే కొండమొదలు అంటారట. అక్కడినుండే పాపికొండలు ప్రారంభమవుతాయని కూడా లాంచి సిబ్బందే చెప్పారు. మేము భోజనాలు ముగించి కొండపైకి ఎక్కడం ప్రారంభించాము. ఏమిటి ఎంత ఎక్కినా ఈ కొండ తరగటం లేదు అనుకొంటుండగా తరిగింది. అక్కడ గిరిజనులు నివసిస్తున్నారు. మా సిబ్బంది వారికి ముందు తెలుసేమో (తెలియటం ఏమిటి? వాళ్ళు ఎప్పుడైనా ప్రయాణం చేయాలంటే వీళ్ళ లాంచీల్లోనే ప్రయాణం చేయాలట) నిముషాలమీద మాకు విశ్రమించడాన్కి షెల్టర్ రెడీ

> మొక్కలు, వృక్షాలతో నిండివున్న ఆ ప్రదేశాన్ని చూడటానికి మాకు రెండేసి కళ్ళు చాలక 'కెమెరా' కళ్ళను కూడా ఉపయోగించుకున్నాము. మాతో తెచ్చుకున్న టీ బిస్కెట్లు వాళ్ళకు కూడా ఇచ్చాము.

అయింది. మేమెవరమో తెల్సిన తరువాత వారు మమ్మల్ని చుట్టిముట్టి చాలా సేపటి వరకు వదలలేదు. తరువాత నిద్రకుపక్రమించాము. ఎంతసేపటికి నిద్రపట్టక ఒకసారి అలా తిరిగివద్దామని బయల్దేరాను. అలా బయల్దేరడం నా జీవితంలో గొప్ప మార్పులు సంభవించడానికి నాంది అని నాకప్పుడు తెరియదు.

* * *

పండు వెన్నెల్లో అలా విహరిస్తూ ముందుకు సాగుతున్నాను. ఆ నిశ్శబ్ద వాతావరణంలో కొద్దిగా

అలికిడి. వెంటనే ప్రకృతి నిశ్శబ్దంగా వుండమని ఆదేశించినట్టు గాలి "ష్ష్ష్ష్ఉఉష్ష్" అని మళ్ళీ నిశ్శబ్దంగా మారిపోయింది. అలాగేనన్నట్లు చెట్లు చేమలూ తలలూపుతున్నాయి. అప్పుడు పడింది నా తలపై ఒకటి. పడి ముందుకు తూలింది. అది ఎర్రటి ఎరుపుతో వెత్తురు ముద్దలు కట్టినట్లున్న అడవి పూవు. పండు వెన్నెల్లో ప్రకాశిస్తూ నేనే ఏ తలపై పడ్డావంటూ పరిహాశిస్తున్నది. కొద్దిగా ముందుకు కదిలాను పడింది వెంటనే మరొకటి. దానితో బాటే గోదావరి గలగలమన్నట్టు చిన్న నవ్వు. ఆనవ్వు వెంబడే అటు తిరిగాను. అప్పుడు కన్పించింది ఆమె.

ఆమె అందంగా లేదు, అందమే ఆమెలా వుంది. నడిరేయి వెన్నెలలో అడవి అందాలను పరికించడాన్కి అప్పుడే విచ్చుకొన్న 'కన్నెగులాబి'లా వుందామె. దగ్గరకు రమ్మన్నట్టు తలవూపింది. అప్రయత్నంగానే అటు అడుగులు వేశాను. దగ్గరకు వెళ్ళాక చెప్పింది. అందరితో బాటే మమ్మల్ని చూడటాన్కి వచ్చిందట, వెంటనే ఇంటికి తిరిగి వెళ్ళాలనిపించక వెన్నెల్లో అలా తిరుగుతుందట, ఈలోగా నేను కన్పిస్తే నమ్మ వెంబడించింది".

అలా నేనామెను కలుసుకున్న ఆ క్షణం. "ఆమెతో

ఎన్నో ఏళ్ళ సహచర్య ఫలితంగా ఏర్పడిన దగ్గరి తనానికి బాటలు వేసింది''. మేమిద్దరం ఎన్నో ఏళ్ళనుంచి కలసి వున్న వాళ్ళలా కబుర్లు చెప్పుకున్నాం. మధ్యలో అసలు వాళ్ళపల్లె అదికాదని పక్కనే వున్న పేరంటిపల్లె అని అయ్య పోగానే ఇక్కడకు వచ్చేశానని చెప్పింది.

అలా ఆమె మాట్లాడుతుంటే వంపులు తిరుగుతూన్న సన్నని ఎర్రని పెదవులను చూస్తూ తమకంతో పటుక్కున చుంబించాను. ఆమె ఏమాత్రం అభ్యంతరం చెప్పలేదు. పైగా నా తలను లాలనగా దగ్గరకు తీసుకొంది. ''నేను సెలయేరు, ఆమె మృదుల మందాకిని — కొండలపై జారిపడుతున్న సెలయేటి చప్పుళ్ళు మందాకినిలో ఐక్యం అవుతూ శాంతించినట్టు భావన.

సూర్యోదయానికి ఇంకా రెండు గంటలుందనగా వెళ్ళడానికామె వుద్యుక్తురాలైంది. వెళుతుంటే ఇదిగో అని పిలిచాను. ''నాపేరు వెన్నెల'' అంటూ కిలకిలా నవ్వుతూ వెన్నెలలో సాగిపోయింది.

* * *

ఆ ఏరియా అంతా తిరుగుతూ, నచ్చిన ప్రదేశాన్ని 'కెమెరా' రోల్స్‌లో నింపుతున్నారు. నా మనసు మాత్రం రాత్రి జరిగిన సంఘటన పట్ల తిరుగుతూ వుంది.

మధ్యాహ్నం భోజనాలైన తరువాత, అక్కడకి దగ్గరలోనేవు న్న 'పేరంటిపల్లి'కి వెడదామని చెప్పారు మా లాంచి సిబ్బంది. కొండలమీదుగా పేరంటిపల్లికి దారివుందిగాని, క్రూరమైన అడవి జంతువులు సంచరించే ప్రదేశం. దారివున్నా అడవిలో నడవటం కష్టం కాబట్టి లాంచిలోనే వెళ్ళడానికి నిర్ణయించుకొన్నాము. ''నదిలో వెళుతున్న కొద్దీ పాపికొండల మధ్య గోదావరి చుట్టూ కొండలు కవర్ చేసి వృత్తాకారంలో వుండి ప్రపంచం లోకెల్లా అతిపెద్ద స్విమ్మింగ్ పూల్'' అని భ్రమించేలా వుంటుంది.

లాంచిని ఆపుచేసి కొండపైకి వెళ్ళాము. పేరంటిపల్లె కూడా చిన్నపల్లె. ముగ్గురు కుర్రాళ్ళు మాకు ఆ ప్రదేశాన్నంతా చూపించసాగారు. ఎన్నో రకాల పుష్ప, ఫల మొక్కలు, వృక్షాలతో నిండివున్న ఆ ప్రదేశాన్ని చూడటానికి మాకు రెండేసి కళ్ళు చాలక 'కెమెరా' కళ్ళను కూడా ఉపయోగించుకున్నాము. మాతో తెచ్చుకున్న టీ బిస్కెట్లు వాళ్ళక్కూడా ఇచ్చాం. వాళ్ళు చాలా ఇష్టంగా తిన్నారు. సమయం చూసి ఒక వ్యక్తిని 'వెన్నెల ఏమైంది'? అని అడిగాను. ఏ వెన్నెల. అన్నాడు అదే వాళ్ళ అయ్య చచ్చిపోయిన తరువాత వెన్నెల ఏమైంది? అని అడిగాను. ఎలా అడగాలో తెలియక అంతే నిశ్చేష్టుడయ్యాడతడు. మరుక్షణం తెప్పరిల్లి ''వెన్నెల చచ్చిపోయింది'' అన్నాడు. ఈసారి నేను అవాక్కయ్యాను. ఎలా పోయింది అడిగాను తేరుకొని. తెలియదు అందరూ అలాగే అంటారు. కాని అని ఆగాడతడు. ఏమిటికాని? రెట్టించాను వెంటనే అతడు చెప్పిన విషయం ఇది.

''వెన్నెల వాళ్ళ అయ్యపోయిన తరువాత అందరూ నన్ను చేసుకోమంటే నన్ను చేసుకోమని వెన్నెలను మనువు కోసం వేధించేవారట. తాను కూడా ఒకసారి అడిగాడట. కాని తరువాత నాలుగురోజులకే వెన్నెల కనిపించడం లేదని అందరికి తెల్సిపోయింది. ఏమయిందో ఎవరికి తెలియదు. చనిపోయిందని మాత్రం అందరూ అనుకొంటున్నారు. వెంటనే నాకు మావూళ్ళో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. మావూరి పూజారి గుడికి పూజారే కాదు, మోతుబరి పెద్ద మనిషి కూడా. ఇలాగే ఎవరూ లేని ఒక అమ్మాయిని చా లాదూరంగా వేరే వూరికి తరలించి, నెలలో పది రోజులు బలవంత కాపురం వెలగబెట్టేవాడు. వూళ్ళో అందరికీ ఆ అమ్మాయి చనిపోయిందనే పుకారు వ్యాపించిపోయింది. ఇక అక్కడ్నుంచి ఆ అమ్మాయి అందరిమీద ఆవహించేది. డిగ్రీలు పుచ్చుకొని కాళీ గానున్న నేను — నా మిత్రుడు పత్తేదారు చర్యలు ప్రారంభించి, పూజారిని వెంబడించి ''తీగ'' అనే మిస్టరీని లాగితే గాని 'డొంక' అనే అసలు విషయం ప్రజలకు తెలియలేదు''. — అలాగే వెన్నెల విషయంలో కూడా ఏదో మిస్టరీ వుందని అనుకొంటుండగా మా లాంచి మళ్ళీ కొండ మొదలు వైపు సాగిపోయింది.

ఆరోజు రాత్రి మళ్ళీ వ్యాహ్యాళికి బయలుదేరాను. ఎప్పటిలాగే అడవినిండా వెన్నెల పరచుకుంది. ఆ పండు వెన్నెల్లో నడుచుకుంటూ వచ్చింది వెన్నెల. ''నేను ఆరోజు విన్నదంతా అడిగేశాను. ఏడుస్తూ చెప్పసాగింది. అసలు జరిగింది అది కాదట. ఒంటరిగా ఉండటంవల్ల అందరూ మనువాడమని వేధించి బెదిరించేవారట. అందుకని పారిపోయి అడవిలో ఒంటరిగా వుంటూ, పళ్ళుకాయలు తింటూ బ్రతుకుతున్నదట. నేను మామూలు సమయాల్లో అయితే నమ్మేవాడిని కాదు. కాని ఎదురుగా ఒక దివ్యసుందర సజీవమూర్తి స్వయంగా చెప్తున్న మాటలను నేనెలా కాదనగలను. పైపెచ్చు ఆమెనొదిలి నేనొక క్షణం కూడా వుండలేకపోతున్నానా. ''లవ్ ఎట్ ఫస్ట్ సైట్'' అంటే ఇదే కాబోలు.

గోదావరికిరుప్రక్కలా వున్న, ఆ చిన్న పల్లెలు ప్రదేశాలు, మాకు బాగా నచ్చాయి. మా డైరక్టర్ గారు మద్రాస్‌కు ప్రయాణం రేపేనని చెప్పారు. ఈ ఐదురోజులుగా రాత్రివేళ వెన్నెలను కలుసుకొంటూనే వున్నాను. ఆమె తోడు లేకుండా మద్రాస్ వెళ్ళడాన్కి నా మనసు ససేమిరా ఒప్పుకోవడం లేదు. వెన్నెలను తనతో రమ్మంటే వస్తుందా! లేకపోతే తను కొన్నాళ్ళు ఇక్కడే వుండి మెల్లగా ఆమెను ఒప్పించి తనతో తీసుకుపోవచ్చు. రకరకాల ఆలోచనలతో మనక వెన్నెల్లో కొండ చివర వరకు వచ్చేశాను. క్రిందకు చూశాను. నదీమ తల్లి నవరాగానికి నాంది పలుకుతూ గల — గలలతో ప్రవహిస్తోంది. ''అప్పుడు గుర్తుకు వచ్చింది లాంచి సిబ్బంది చెప్పిన మాట. వాళ్ళు చెప్పడమేమిటి తనకు మాత్రం తెలియదా! అంత ఎత్తునుండి క్రింద పడితే. తరువాత ఆలోచించలేకపోయాను.

ఈరోజు వెన్నెల ఇంకా రాలేదేమిటి? అనుకుంటూ కొండ దిగడం ప్రారంభించాను. పూర్తిగా క్రిందకు దిగకుండానే ఒక బండపైకి ఎక్కి కూర్చున్నా. ఒకరోజు ఇదే బండమీద నుండి ఫోటో తీస్తూ ఇక్కడనుండి పడితే అని అడిగాడు తను సరదాగా — ''ఏమీకాదు ఎందుకంటే ఇక్కడనుండి కిందకు పదిహేను అడుగులు కూడా వుండదు. పైగా ఇంకే బండలూ, రాళ్ళూ అడ్డులేవు కాబట్టి సరాసరి గోదావరిలో పడతారు'' అన్నాడు అంతే హ్యూమరస్‌గా లాంచీ డ్రైవర్. హఠాత్తుగా వినిపించిన సవ్వడికి వెనుకకు తిరగబోయా, అంతే రెండు కాళ్ళూ 'స్లిప్' అయి వెల్లకిలా క్రిందకు జారిపోసాగాను.

* * *

ఆ తరువాత డైరక్టర్ గారితో నేను మద్రాస్ వెళ్ళలేదు. వెన్నెలతో ఇక్కడే వుండిపోయాను. మరో నెలరోజులకు, మా డైరక్టర్‌గారు సిబ్బంది సరంజామాతో ఇక్కడకే వచ్చి షూటింగ్ ప్రారంభించారు. ఆ షూటింగ్ జరిగినన్నాళ్ళు వెన్నెలా నేను రహస్యంగా వాళ్ళను గమనించేవాళ్ళం తప్ప ఎప్పుడూ ఎదురు పడలేదు.

సినిమా రిలీజయిన తరువాత మా దగ్గరలో వున్న టౌన్‌లో టిక్కట్లు లేకుండా వెన్నెలా నేను ఆ సినిమాను రహస్యంగా చూశాం. చిత్రం ప్రారంభంలో ఇలా వుంది.

''ఈ చిత్రం లోకేషన్ సెలెక్ట్ చేయడాన్కి నాతో బాటువచ్చి ప్రమాదవశాత్తూ, గోదావరి నీటిలో నున్న పెద్ద బండపై పడి ప్రాణాలు విడిచిన పుత్ర సమానుడైన అసిస్టెంట్ డైరక్టర్ 'రవితేజ'కి ఈ చిత్రం అంకితం.

*

పొదుపు

''ఏరా పొదుపు మీద వ్యాసం రాయమంటే రాయలేదు?'' అడిగాడు మాస్టారు.

''రాద్దామనే అనుకున్నానండి. కానీ బలపం అరిగిపోతుందని రాయలేదండి'' తక్కున చెప్పాడు రాము.

—సుభాష్‌చందర్ (హైదరాబాద్)

సంగతి